‘పది’సన్నద్ధతకు స్పెషల్ పరీక్ష

గ్రాండ్ టెస్టు మాదిరిగా...
వచ్చే నెల 5 నుంచి ప్రత్యేక పరీక్ష

- ఫిబ్రవరి 19 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలకూ షెడ్యూల్ ఖరారు
- మార్చి 18 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు
- మేడ్చల్ జిల్లాలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య 46,838



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభమవుతుండటంతో.. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ షెడ్యూల్ ఖరారు చేసింది. అయితే.. అంతకు విద్యార్థులను మరింతగా పరీక్షలకు సిద్ధం చేయటానికి గతంలో గ్రాండ్ టెస్టులను జిల్లా విద్యాశాఖ నిర్వహించింది.ఈ విద్యా సంవత్సరంలోనూ గ్రాండ్ టెస్టు మాదిరిగానే స్పెషల్ (ప్రత్యేక) పరీక్షలను ఫిబ్రవరి 5 నుంచి 12 వరకు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విద్యాసంవత్సరంలో ‘పది’లో ఉత్తమ ఫలితాల సాధన ధ్యేయంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే ఎస్సీఈఆర్టీ ‘లక్ష్యం’ పేరిట ఈ విద్యాసంవత్సరంలో రూపొందించిన పత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు పదో తరగతి వార్షిక పరీక్షలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ,ఎయిడెడ్ ,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 46,838 మంది విద్యార్థులను మరింత సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక(స్పెషల్) పరీక్ష నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యాధికారులు పంపిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక మేరకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ పేర్కొంది. ఈ పరీక్షలను మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించనున్నారు.

ప్రత్యేక పరీక్షలకు సూచనలివే..

పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక(స్పెషల్) పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ కొన్ని సూచనలు చేసింది. ఇప్పటికే నిర్వహించిన సంగ్రహణాత్మక పరీక్ష-1లో ఇవ్వని సిలబస్‌లోని పాఠ్యాంశాల ప్రశ్నలు ఉండాలని తెలిపింది. అక్టోబర్ నుంచి జనవరి సిలబస్‌కు సంబంధించినవిగా ఉండాలని పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాల్సి ఉంటుంది. పరీక్ష పూర్తి కాగానే వెంటనే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలి. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు సంబంధిత విషయాలపై ఉపాధ్యాయులు రెమిడియల్(పునశ్చరణ) తరగతులను నిర్వహించాల్సి ఉంటుంది.

కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



కీసర: తిమ్మాయిపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన ఎస్సీకమ్యూనిటీ హాల్ భవనసముదాయాన్ని శనివారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మెన్ బెస్తవెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, సర్పంచ్ పెంటయ్య, ఎంపీటీసీసభ్యురాలు కందాడి ప్రమీల,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: కొండాపూర్ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొండాపూర్ గ్రామం, కమర్షియల్, ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, 33/11కేవీ కొండాపూర్ వ్యవసాయ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు. అలాగే 33/11 కేవీ సింగిరేణి ఫీడర్ సింగిరేణి కాలనీలో మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఎదులాబాద్ క్రికెట్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లారెడ్డి క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆవిష్కరించారు. విన్నర్‌కు రూ. 50 వేలు, రన్నర్‌కు రూ. 25 వేలు అందజేస్తారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, బిక్షపతిగౌడ్, వార్డు సభ్యుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, నాగేశ్, రవి, శ్రీకాంత్, శేఖర్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రణయ్‌రాజ్‌కు ప్రథమ స్థానం

ఉప్పల్: డబ్ల్యూపీసీ తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఉప్పల్‌కు చెందిన ప్రణయ్‌రాజ్ ప్రథమస్థానం సాధించారు. డబ్ల్యూపీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ ఆధ్వర్యంలో రామచంద్రాపురం కొల్లూరులో వీడీఎల్ ఫిట్నెస్ సొల్యూషన్స్ తెలంగాణ రెండో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా నుంచి ప్రణయ్‌రాజ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో టీన్‌త్రి అండర్-60 కిలోల కేటగిరి డెడ్‌లిఫ్ట్‌లో 140 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 64 కిలోలు, ఫుష్‌పుల్‌లో 205 కిలోల బరువు ఎత్తి మూడు పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. సిమ్ లయన్ ఫిట్‌నెస్ సెంటర్ ద్వారా కోచింగ్ తీసుకుని కోచ్ ఇచ్చిన మెలుకువలతోనే ముందుకు సాగినట్లు ప్రణయ్ తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష

అల్వాల్: సైనిక్‌పురిలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆర్డీఓ కార్యాలయంలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం సబ్ డివిజనల్ లెవెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ పైన జరుగుతున్న కేసులపై చర్చించారు. కేసుల గురించి సంబంధిత పోలీస్ ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, ఐఓలు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆయన ఆగ్రహించారు. సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీకర్‌రెడ్డి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓలు నాగిరెడ్డి, వెంకటేష్, సాయిప్రకాష్‌గౌడ్, కృష్ణ, దేవి ఎంసీఏ సభ్యులు వెంకటేష్, రాజు, నవకిరణ్, సందీప్, రమేష్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, పరమేష్, సుశాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజు తదితరులున్నారు.

ఉప్పల్ రహదారి సమస్యపై మంత్రికి వినతి

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. ఉప్పల్ - వరంగల్ జాతీయ రహదారితో ఏళ్ల తరబడి ఉప్పల్ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్‌యాదవ్ అన్నారు. వాసవీనగర్ కాలనీ చౌరస్తా నుంచి మెయిన్‌రోడ్డు వరకు రూ.12.50 లక్షలతో వేస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన డీఈ శారదతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు. డివిజన్‌లో మిగిలిన పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, కాలనీవాసులు కోటేశ్వరరావు, మిట్టపల్లి సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నామాల రవి, సుభాష్, బుచ్చయ్య, సహోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



అల్వాల్: యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం సైనిక్‌పురిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటమ్న్ సెలూన్ వాణిజ్య కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆటమ్న్ సెలూన్ బిజినెస్ హెడ్ శ్రీధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కండ్లకోయ గేట్ వే ఐటీ పార్క్ ను పూర్తి చేయాలి

మేడ్చల్ :గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వం శంఖుస్థాపన చేసి కండ్లకోయ గేట్ వే ఐటీ పార్క్ ను పూర్తి చేయాలని కొంపల్లి ఐటీ ఎంట్రపెన్యూర్స్ అసోసియెషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు ఆయన టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఐటీ పార్క్‌ను పూర్తి చేసి మెట్రో రైల్ ను మేడ్చల్ వరకు ఏర్పాటు చేయాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు.

సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా హనుమంత్‌రెడ్డి



మేడ్చల్: జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వార్డు సభ్యుడు హనుమంత్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్ హనుమంత్‌రెడ్డి ని జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారి చేశారు.


అభివృద్ధి పనులకు రూ. 3 కోట్లు కేటాయింపు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 3 కోట్ల నిధులు కేటాయించినట్లు చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన శనివారం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కౌన్సిల్ ఆమోదంతో కేటాయించిన రూ. 3 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, వైకుంఠధామాల అభివృద్ధి వంటి పనులు చేపడతామన్నారు. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లయిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సభ్యుల సహకారంతో మరిన్ని మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గట్టుమైసమ్మ గుట్టపై కొలువుదీరిన అమ్మవారు



జాతర బందోబస్తుపై సూచనలు ఇస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి



నేడే గట్టుమైసమ్మ జాతర

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణ ప్రజలను చల్లంగా చూసే దేవత శ్రీ గట్టుమైసమ్మ జాతరకు ఆలయం ముస్తాబైంది. స్థానికులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారి జాతర ఆదివారం జరుపుకోనున్నారు. పుష్య మాసంలో సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారం రోజున జరుపుకోవడం ఆనవాయితీ. జాతరకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల రద్దీని దష్టిలో ఉంచుకొని ప్రమాదాలు జరుగకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, స్థానిక సీఐ మహేందర్‌రెడ్డి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నియోజకవర్గానికి నిధులు కేటాయించండి



గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలు, మురికివాడల్లో అనేక సమస్యలు ఉన్నాయని, డ్రైనేజీ, రోడ్ల సమస్య ఉందని, శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. వీటన్నింటికీ ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

మెరుగైన సేవలు అందించాలి

కుషాయిగూడ: మెరుగైన సేవలందించి వినియోగదారుల మన్ననలు పొందాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. చర్లపల్లిలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ని శనివారం ఐలా చైర్మన్ రోషిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో అందించే ఆధార్ సవరణ, ఓటర్‌ఐడీ దరఖాస్తు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తదితర పథకాలతో పాటు పలు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. స్థానికనేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. శనివారం కాశీపురం, శ్రీసాయిసూర్య ఎన్‌క్లేవ్, న్యూద్వారకానగర్, న్యూఎంఎస్ కాలనీ, గ్రీన్‌ల్యాండ్, ప్రవంతినగర్, మురళీకృష్ణ నగర్, వెంకన్న కాలనీలు 9 కాలనీలతో కూడిన జేఏసీ పిలుపు మేరకు ఆయన అధికారులతో కలిసి కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యలు కాలనీవాసులు తెలిపారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. జలమండలి డీజీఎం సాంబయ్య, జేఏసీ చైర్మన్ మన్మధరెడ్డి, నాయకులు రమేష్, పరమేష్, నవీన్‌రెడ్డి, వీఎస్.రాజు, సరితరమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లక్ష్మీనర్సింగ్‌రావు, సతీష్‌రెడ్డి, రమేష్‌యాదవ్, సుకుమార్, తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

స్థానిక సమస్యలపై...

అల్వాల్: అల్వాల్ జేఏసీ కాలనీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం జేఏసీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే జలమండలి జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. డీజీఎం సాంబయ్య, అల్వాల్ జేఏసీ కాలనీల అసోసియేషన్ అధ్యక్షుడు మన్మధరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ అసోసియేషన్, కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, పరమేష్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



కేక్ కట్‌చేస్తున్న దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్ అన్నారు.మున్సిపల్ పాలకవర్గం 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో ఆల్‌ఇండియాలో దమ్మాయిగూడ మున్సిపాలిటీకి రెండవస్థానంలో వచ్చినందుకు మున్సిపల్‌కమిషనర్ ఎస్. రాజమల్లయ్యను ఘనం సత్కరించారు.

శ్రీరంగవరంలో క్రికెట్ టోర్నమెంట్



బహుమతులతో గెలుపొందిన జట్టు

మేడ్చల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో యువకుల కోసం క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన టోర్నమెంట్‌లో మండలంలోని వివిధ గ్రామాల జట్లు పాల్గొన్నాయి. శనివారం నిర్వహించిన ఫైన ల్స్‌లో రైజింగ్ బుల్స్ జట్టు, ఈగల్స్ టీం లు తలపడగా రైజింగ్ బుల్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు జెడ్పీటీసీ శైలజారెడ్డి,సర్పంచ్ విజయానందరెడ్డిలు బహుమతులు అందజేశారు.

సోమ్లాలాల్‌నాయక్‌కు పలువురి అభినందనలు



జవహర్‌నగర్: కేతావత్ సోమ్లాలాల్ నాయక్‌కు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో శనివారం జవహర్‌నగర్‌కు చెందిన పలువురు గిరిజన నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. గిరిజన నాయకులు త్రివిక్రం రాథోడ్, బిక్షునాయక్, మాలునాయక్, కృష్ణనాయక్, హీరాలాల్‌నాయక్, చందర్‌చౌహాన్, పడతియానాయక్ తదితరులు ఉన్నారు.

గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మృతి



మేడ్చల్: మండల సీనియర్ రాజకీయ నాయకుడు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ అమరం కృష్ణారెడ్డి(60) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. టీడీపీ నుండి రాజకీయం ప్రారంభించిన కృష్ణారెడ్డి గుండ్లపోచంపల్లికి 1990నుండి 2002 వరకు సర్పంచ్‌గా పని చేశారు.

రైలులోంచి పడి యువకుడికి గాయాలు

పోచారం: రైలు డోర్ నుండి ఓ యువకుడు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ సంఘటన యమ్నంపేట్‌లో శనివారం జరిగింది. యమ్నంపేట్ వద్ద రైలులో ప్రయాణిస్తున్న విమల్ (25) ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. కాలుకు బలమైన గాయం తగిలింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని బాధితునికి ప్రాథమిక చికిత్స చేసి, తదుపరి వైద్యం కోసం గాంధీ హాస్పిటల్‌లో చేర్పించారు.

ఉచిత వైద్యశిబిరం

ఘట్‌కేసర్: పట్టణంలోని మైసమ్మగుట్ట వెనకబడిన తరగతుల వసతి గృహంలో మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య హాజరై శిబిరం ప్రారంభించారు. శిబిరంలో వైద్యపరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ విద్యా ఆస్పత్రిలో...

శ్రీ విద్యా ఆస్పత్రిలో కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి, శ్రీ విద్యా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై శిబిరం ప్రారంభించారు. రామోజీ, బిక్కునాయక్, ఆంజనేయులుగౌడ్, రూప్ సింగ్‌నాయక్, శ్రీరాములు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో..



శ్రీ విద్యాఆస్పత్రిలో..

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఫీజులో రాయితీ



అనురాగ్ సెట్-2024 పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఈఓ నీలిమా, రిజిస్ట్రార్ బాలాజీ

ఘట్‌కేసర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఫీజులో రాయితీ కల్పిస్తామని అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ) సీఈఓ నీలిమా అన్నారు. వెంకటాపూర్ ఏయూలో అనురాగ్ సెట్-2024 (ఇంజినీరింగ్, వ్యవసాయం, నర్సింగ్)ను రిజిస్ట్రార్ బాలాజీ ఉట్లతో కలిసి సెట్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనురాగ్ సెట్-2024 టాపర్‌లకు రూ. 6.5 కోట్ల ఉపకారవేతనాలు అందజేస్తామని, ఎంసెట్‌లో 20,000 వరకు ర్యాంకు పొందిన విద్యార్థులకు ఫీజులో 50 శాతం, క్రీడాకారులకు 100 శాతం, ఎన్‌సీసీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కూడ ఉపకార వేతనం అందజేస్తామన్నారు. 600 మందికి పైగా విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా నేటి వరకు ఉద్యోగాలు పొందారని, అత్యధికంగా రూ. 38 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం లభించిందన్నారు. అనురాగ్ సెట్ ఫిబ్రవరి 11, 2024న ప్రారంభం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో అనురాగ్ పల్లా, ప్రొఫెసర్లు తారాసింగ్, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, సుధీర్‌రెడ్డి, ముత్తారెడ్డి, పలు విభాగాల విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు ప్రారంభం

ఘట్‌కేసర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలల 7వ రాష్ట్ర స్థాయి క్రీడలు ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లోని బుద్వేల్ కళాశాలలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా గురుకుల అదనపు కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గౌరవ అతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించి క్రీడల జెండాను ఆవిష్కరించారు. ఈ క్రీడల్లో తెలంగాణలోని 30 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ మహిళ కళాశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామని, గురుకుల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి విజేతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంకుషాపూర్ సర్పంచ్ జలజ, ఎంపీటీసీ శోభారాణి, అధికారులు నిరుపమ, నాగకళ్యాణి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



క్రీడల జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి



నాగారం మున్సిపల్‌సర్వసభ్యసమావేశం

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3.5 కోట్ల నిధులను కేటాయిస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులనుండి రూ.1.27 కోట్లు, సాధారణ నిధులు రూ.1.70 కోట్లు, పట్టణ ప్రగతి నిధులనుండి 57 లక్షల 60 వేల నిధులను వెచ్చించి వివిధ కాలనీల్లో సీసీరోడ్లుపనులు, డ్రైనేజీ పనులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మెన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, సానిటరీఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.